## కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 29 : ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో క్రమబద్ధీకరణ కాకుండా మిగిలిపోయిన కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని కలిసి టీజీజేఎల్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఖమ్మం వచ్చిన ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి జిల్లా అధ్యక్షుడు గుమ్మడి మల్లయ్యతో కలిసి వినతిపత్రం అందించారు. పలు కారణాలతో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 444 మంది, డిగ్రీ కళాశాలల్లో 689 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేయలేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి క్రమబద్ధీకరణ చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు కృష్ణార్జునరావు, మురళీకృష్ణ, భాస్కర్, శ్రీకాంత్, రాంబాబు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

## 'గుంటి సత్యనారాయణ సేవలు మరువలేనివి'

సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న నేతలు

ఖమ్మం సిటీ, సెప్టెంబర్ 29 : ఖమ్మం గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, చుంచుపల్లి మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మరణించిన గుంటి సత్యనారాయణ సేవలు మరువలేనివని 44వ డివిజన్ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ అన్నారు. ఆదివారం నగరంలోని బుర్హాన్‌పురం గంగపుత్ర కాలనీలో సత్యనారాయణ సంతాప సభ నిర్వహించారు. ఆయన ఆశయ సాధన కోసం గంగపుత్రులు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నేతలు సోమయ్య, జే దుర్గేందర్‌రావు, జాజుల శంకరయ్య, రామచంద్రయ్య, పీ ఉపేందర్, జీ కుమారస్వామి పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజేశ్వరరావు

జిల్లా నూతన సంఘాన్ని ఎన్నుకుంటున్న సంఘం బాధ్యులు

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 29 : ఖమ్మం జిల్లా తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో జరిగాయి. సంఘం నూతన అధ్యక్షుడిగా మామునూరి రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పీవీఎస్ఎన్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా రవీంద్ర, షేక్ మీరా, మొరం మధు కుమార్, పీ మధుకర్, సహాయ అధ్యక్షుడిగా గొల్లపూడి శ్రీనివాసరావు, జేసీసీ సభ్యులుగా బండి భాస్కర్, ఉపాధ్యక్షులుగా సీహెచ్ వాణీశ్రీ, చెంపల్‌రాజు, ఎంవీ కోటేశ్వరరావు, జీవన్‌రెడ్డిను నియమించారు. కోశాధికారిగా శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీలుగా రవికుమార్, ఎండీ ఆసిఫ్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జానీమియా, ప్రమీలరాణి, భారతి, వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మోదుగు వేలాద్రి వ్యవహరించారు. అబ్జర్వర్‌గా మల్లవరపు రాజేశ్ ఉన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి నందకుమార్ సమక్షంలో జరిగిన ఎన్నికలో రాష్ట్ర సంఘం బాధ్యులు అనంత్, మాజీ అధ్యక్షుడు నడింపల్లి వెంకటపతిరాజు, ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లె రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## చట్టబద్ధత లేని పనులను ప్రోత్సహించొద్దు

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 29: చట్టబద్ధత లేని పనులను ప్రోత్సహిస్తూ కార్మికులను మానసిక భయాందోళనకు గురి చేయడం, వారిని ఆర్థికంగా నష్టపరిచే చర్యలకు పాల్పడటం సరికాదని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఓసీ క్వారీలో ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు యంత్రాల, కార్మిక పనితీరును పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేందుకు లంచ్ కంటిన్యూ సమయం ఉపయోగకరంగా ఉంటుందని యాజమాన్యం భావిస్తే దానికి చట్టబద్ధత కల్పించి పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎలాంటి చట్టబద్ధత లేకుండా లంచ్ కంటిన్యూ పనులు చేపట్టడం వల్ల రక్షణ నిబంధనలు ఉల్లంఘించినట్లవుతుందని తెలిపారు. లంచ్ కంటిన్యూకు ఎలాంటి చట్టబద్ధత లేకపోవడం వల్ల లంచ్ కంటిన్యూ చేసి శ్రమించిన కార్మికులకు మస్టర్ ఆడిట్ తనిఖీల సమయంలో ఇబ్బందుల గురవుతున్నారని తెలిపారు. లంచ్ కంటిన్యూ చేపంచిన సంబంధిత అధికారులు ఆడిట్ తనిఖీల సమయంలో తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరించడం వల్ల కార్మికులు దోషులుగా నిలబడాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు.

# పడకేసిన పల్లె'పాలన'

**పంచాయతీలకు నిధులివ్వని ప్రభుత్వం**

**సొంత ఖర్చులతో నెట్టుకొస్తున్న కార్యదర్శులు**

**నిధుల కొరతతో ముందుకు సాగని అభివృద్ధి**

సారపాక, సెప్టెంబర్ 29: దేశానికి పట్టుగొమ్ములు పల్లెలు.. అలాంటి పల్లెల్లో ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పాలన పడకేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పల్లెలు పచ్చదనంతో పాటు నిధులు మెండుగా ఉండడంతో పంచాయతీలు అభివృద్ధి పథంలో పరుగులు పెట్టాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 10 నెలలైనా పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోడంతో ఉన్న నిధులతో.. అసలు నిధులు లేకపోయినా సొంత ఖర్చు వెచ్చించి కార్యదర్శులే ఆ పంచాయతీల ఆలనా పాలనా చూసుకోవాల్సిన పరిస్థితి. దీంతో నియోజకవర్గవ్యాప్తంగా పంచాయతీల్లో అభివృద్ధి లేకపోగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పల్లె పాలన ముందుకుసాగడంలేదు.

### 118 పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి

పినపాక నియోజకవర్గ వ్యాప్తంగా 118 పంచాయతీల్లో నిధుల కొరత వేధిస్తోంది. అశ్వాపురం 24, పినపాక 23, బూర్గంపహాడ్ 18, కరకగూడెం 16, మణుగూరు 14, ఆళ్లపల్లి 12, గుండాల 11 పంచాయతీల్లో ఏ పంచాయతీకి కూడా నిధులు లేకపోవడంతో విధులు నిర్వహించే కార్యదర్శులు వారి జేబుల్లో నుంచే పంచాయతీకి అవసరమైన పనులను సమకూర్చుకుంటూ ఉన్నదాంట్లోనే అభివృద్ధి చేసుకుంటున్నారు. కార్యదర్శులకు ప్రభుత్వం ఇచ్చేదే అరకొర వేతనాలు కావడంతో ఆ వేతనాల నుంచే ట్రాక్టర్ల నిర్వహణ, వీధి దీపాలు, పారిశుధ్యం కోసం కొంతమేరకు వెచ్చించి పంచాయతీ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నారు. తమకు వచ్చే వేతనంతో అటు కుటుంబాన్ని పోషించుకోలేక.. ఇటు పంచాయతీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేక కార్యదర్శులు సతమతవుతున్నారు.

### పూర్వ వైభవం కోల్పోయిన పంచాయతీలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల కాలంలో నియోజకవర్గవ్యాప్తంగా పంచాయతీలు పూర్వ వైభవాన్ని కోల్పోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పంచాయతీలతో పాటు కొత్త పంచాయతీలకు సైతం మెండుగా నిధులు ఇవ్వడంతో గత పాలకులు పచ్చదనాన్ని పెంపొందిస్తూ పారిశుధ్యం మెరుగుపర్చడం, గ్రామాల్లో ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అన్ని పనులను చక్కగా తీర్చిదిద్దుతూ పంచాయతీలను అభివృద్ధిలో ముందుంచారు. తాజాగా సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలనలో ఇలా పంచాయతీలకు నిధులు లేకపోవడంతో పాటు కార్యదర్శులకు ఆర్థికభారం కల్పించడంతో పంచాయతీల్లో పాలన పడకేసినట్లయింది. పారిశుధ్యం, వీధిలైట్లు మొదలు తాగునీటి సరఫరా, ట్రాక్టర్‌కు డీజిల్ నిర్వహణ, మొక్కలకు నీళ్లు పోయించడం వంటి వాటికి నిధులు పెట్టాల్సి ఉండడంతో పాటు ఎమ్మెల్యే పర్యటన, గ్రామసభల ఖర్చు, స్వచ్ఛదనం, పచ్చదనం ఖర్చులు పంచాయతీలే భరించాల్సి రావడం పెనుభారంగా మారింది. మరోపక్క పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి సైతం ఐదు నెలలుగా వేతనాలు లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేస్తే తప్ప పంచాయతీ పాలన అభివృద్ధిబాట పట్టే పరిస్థితిలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తాళ్లగొమ్మూరులోని పంచాయతీ కార్యాలయం

### నిధుల కొరతతో పంచాయతీల నిర్వహణ భారమే.. :

**విజయ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు**

నిధులు లేకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారింది. గత డిసెంబర్ నుంచి రూపాయి బిళ్ల కూడా పంచాయతీలకు విదల్చలేదు. పంచాయతీల్లో కార్యదర్శులు ట్రాక్టర్ల నిర్వహణ, వీధిదీపాల కోసం వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి. పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి. మండలంలో కొందరు కార్యదర్శులు లక్షల్లో సైతం పంచాయతీల నిర్వహణకు ఖర్చు చేసిన దాఖలాలు ఉన్నాయి. ప్రభుత్వం సకాలంలో పంచాయతీలకు నిధులు ఇస్తే పంచాయతీలను అభివృద్ధి చేసుకునే వీలుంటుంది. పంచాయతీ కార్యదర్శులకు వచ్చిన వేతనంలో పంచాయతీల నిర్వహణకు ఖర్చుచేయడంతో కుటుంబపోషణ సైతం భారంగా ఉంటుంది.

## ఛత్తీస్‌గఢ్‌లో పేలిన మందుపాతర

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 29: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో భద్రతా దళాలను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఐదుగురు జవాన్లు గాయపడిన ఘటన ఆదివారం ఉదయం బీజాపూర్ జిల్లాలో జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా తారెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నగెలూర్ అటవీ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ 153వ బెటాలియన్‌కు చెందిన దళాలు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై జవాన్లు కాలు వేయడంతో అది భారీ విస్ఫోటనం చెందింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు జవాన్లు గాయపడ్డారు. తోటి జవాన్లు వెంటనే అప్రమత్తమై క్షతగాత్రులను ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న వారి బేస్‌క్యాంపునకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. గాయపడిన వారిలో ఇన్‌స్పెక్టర్ సంజయ్, అసిస్టెంట్ కానిస్టేబుల్ సాకేత్, జవాన్లు పవన్ కళ్య, లోచన్ మెహత, దూలె రాజేంద్ర ఉన్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి స్థిమితంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో ఒక్కసారిగా ఏజెన్సీ ప్రాంతం ఉలిక్కిపడింది. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ ప్రాంతంలో మరిన్ని ప్రత్యేక భద్రతా దళాలు మోహరించి గాలింపులను ముమ్మరం చేశాయి.

## ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

ఖమ్మం సిటీ, సెప్టెంబర్ 29 : జిల్లా స్థాయి పాఠశాలల క్రీడలు నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, నెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. వీటికి జిల్లావ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభాపాటవాలను చాటుకున్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల, బాలికలు కలిపి మొత్తం ఆరు జోన్ల నుంచి సుమారు 550 మంది క్రీడాకారులు పాల్గొనడం విశేషం. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆయా పోటీలను జిల్లా పాఠశాల క్రీడల కార్యదర్శి కే నరసింహామూర్తి, అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, అసోసియేషన్ కార్యదర్శి షఫిక్ అహ్మద్, సుధాకర్, క్రిష్ణయ్య, రవి, వెంకటేశ్వర్లు, రామారావు, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆదర్శ్, ఇర్ఫాన్, నెట్‌బాల్ కార్యదర్శి పీ.వీ. రమణ పర్యవేక్షించారు. కాగా సోమవారం ఉదయం 9.30 గంటలకు అండర్-17, అండర్-14 బాల, బాలికల పోటీలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, డీవైఎస్‌వో సునీల్ రెడ్డి ప్రారంభించనున్నారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మూర్తి వెల్లడించారు.

పటేల్ స్టేడియంలో హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

టీటీ పోటీల్లో రాణించిన జిల్లా క్రీడాకారులు

### టీటీ జాతీయ జట్టులోకి ఖమ్మం క్రీడాకారులు..

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఖమ్మం జిల్లా క్రీడాకారులు దూసుకుపోతున్నరు. రంగారెడ్డి జిల్లా కాప్ర ఇన్స్పైర్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన బాలురు సిల్వర్, బాలికలు బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రధాన కోచ్ సాంబమూర్తి సారధ్యంలో రాటుదేలిన పిట్టల మోహిత్ కృష్ణ, టీ. శ్రీఅమృత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి మూసా అలీమ్ ప్రకటించారు. జిల్లా స్కూల్ గేమ్స్ చరిత్రలో అండర్-19 విభాగంలో బాల, బాలికలు పతకాలు సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించడం ఇదే ప్రథమం కావడం విశేషం. క్రీడాకారులను టీటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా టేబుల్ టెన్నిస్‌కు మంచిరోజులు వచ్చాయని జిల్లా యువజన, క్రీడల అధికారి టీ సునీల్‌రెడ్డి అన్నారు. టీటీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్, కొండ శ్రీధర్‌రావు, డాక్టర్ జొన్నలగడ్డ శశికుమార్, డాక్టర్ సుమంత్, సంపెట ఉపేందర్, రామచందర్, ఎస్‌కే జానీపాషా, కోటగిరి ప్రవీణ్ కుమార్, పరిటాల చలపతి, అనమోలు శృతి, కామేశ్వరి, గోరిశెట్టి భవ్యచందు, చైతన్య, ఎస్‌కే మనోహర్, రాజేశ్ అనెం, రెడ్డి సాయి శివ, ఎలప్రోలు లాలయ్య, పర్శా పవన్‌లు క్రీడాకారులతోపాటు కోచ్ సాంబమూర్తిని అభినందించారు.

# రాబడి

*మీ రిటైర్మెంట్ అనంతరం ఆనందకర జీవితాన్ని సొంతం చేసుకోవడానికున్న చక్కని ఆర్థిక సాధనాల్లో నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఒకటి. అయితే ఇందులో తగిన యాన్యుటీ ప్లాన్‌ను ఎంచుకొనే బాధ్యత మాత్రం పెన్షనర్‌దే. ఎన్‌పీఎస్ 2024 హ్యాండ్‌బుక్ వివరాల ప్రకారం 2004 జనవరి 1న ఈ స్కీం ప్రారంభమైన దగ్గర్నుంచి పదవీ విరమణ సమయంలోనే 1,65,320 మంది యాన్యుటీ ప్లాన్లను ఎంచుకున్నట్టు తేలింది.*

## ఎన్‌పీఎస్‌లో సరైన ప్లాన్?

**ప్రస్తుతం** ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్ల కోసం 15 రకాల యాన్యుటీ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఎల్ఐసీ, ఎస్బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్, కొటక్ మహీంద్రా లైఫ్, మ్యాక్స్ లైఫ్, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ లైఫ్, టాటా ఏఐఏ లైఫ్, ఆదిత్యా బిర్లా సన్ లైఫ్ తదితర 15 జీవిత బీమా సంస్థలు యాన్యుటీ సర్వీస్ ప్రొవైడర్లుగా పనిచేస్తున్నాయి. యాన్యుటీ రేట్లు, ఆప్షన్స్‌నుబట్టి ఈ ప్లాన్లు మారుతూ ఉంటాయి. ప్రస్తుతమున్న యాన్యుటీ ప్లాన్లలో ఐదు రకాలే పాపులర్. వాటిలో యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, ఎన్‌పీఎస్-ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, యాన్యుటీ ఫర్ లైఫ్ విత్‌ఔట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్‌ఔట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్.

**ఎంచుకోండిలా..**

**యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్**లో సబ్‌స్క్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే ఇది ఆగుతుంది. నామినీకి ప్లాన్ కొన్న ధరలో 100 శాతం తిరిగొస్తుంది.

**జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్**లో సబ్‌స్క్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే వారి భాగస్వామికి వస్తుంది. వీరూ చనిపోతే నామినీకి ప్లాన్ కొన్న ధర మొత్తం తిరిగొస్తుంది.

**ఎన్‌పీఎస్-ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్**లో సబ్‌స్క్రైబర్‌కు, వారు చనిపోతే వారి భాగస్వామికి, వీరూ చనిపోతే సబ్‌స్క్రైబర్ మీద ఆధారపడ్డ తల్లిదండ్రులకు యాన్యుటీ చెల్లింపులు జరుగుతాయి. వీరి తదనంతరం సబ్‌స్క్రైబర్ పిల్లలు లేదా లీగల్ వారసులకు ప్లాన్ కొన్న ధరను మొత్తంగా చెల్లించడం జరుగుతుంది.

**యాన్యుటీ ఫర్ లైఫ్ విత్‌ఔట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్**లో సబ్‌స్క్రైబర్ జీవించి ఉన్నంత వరకే యాన్యుటీ వస్తుంది. చనిపోతే భాగస్వామికి, నామినీలకూ రాదు.

**జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్‌ఔట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్**లో సబ్‌స్క్రైబర్, వారి భాగస్వామి జీవించి ఉన్నంతదాకా యాన్యుటీ వస్తుంది. వీరు చనిపోతే నామినీలకు ఏమీ రాదు. వీటన్నింటిలో మనకు ఏది ఉత్తమం అనుకుంటే దాన్ని ఎంచుకోవడం లాభదాయకం.

### ఇవి గుర్తుంచుకోండి..

**యాన్యుటీని కొనేముందు మన భవిష్యత్తు ఆర్థిక అవసరాలు ఏమిటన్నదానిపై అవగాహన ఉండాలి.**

అందుబాటులో ఉన్న యాన్యుటీ, పేఔట్ ఆప్షన్లు, నిబంధనలు, యాన్యుటీ కాంట్రాక్ట్ షరతులనూ తెలుసుకోవాలి.

**వయసు, కొనే ధరనుబట్టి యాన్యుటీ రేట్లు ఆధారపడి ఉంటాయి.**

నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక, వార్షికవారీ చెల్లింపులను ఎంచుకోవచ్చు.

**పెన్షనర్ మరణానంతరం భాగస్వామికి కూడా పెన్షన్ వచ్చే ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ తక్కువగా వస్తుంది.**

కొన్న ధరను తిరిగి చెల్లించనక్కర్లేని ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ ఎక్కువగా వస్తుంది.

**ఒక్కసారి యాన్యుటీ ఆప్షన్‌ను ఎంచుకొంటే ఇక మారదు. కాబట్టి ఎంచుకొనేటప్పుడే అన్ని చూసుకొని నిర్ణయం తీసుకోవాలి.**

# చిన్న పెట్టుబడి.. పెద్ద రాబడి

**మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో ఇన్వెస్ట్ చేస్తారా?**

**త్వరపడండి.. మరో 6 నెలలే సమయం**

**మీరు** ఒక మహిళ అయితే, నమ్మకమైన రిటర్నులతో సురక్షిత పెట్టుబడిని కోరుకుంటున్నట్టైతే.. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ)ను తీసుకోవచ్చు. కనీస పెట్టుబడి రూ.1,000 నుంచి మొదలవుతుంది. వడ్డీరేటు కూడా 7.5 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న చాలా ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) లేదా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్ (పీపీఎఫ్)లపై పొందే వడ్డీలకన్నా ఇది ఎక్కువే. అంతేగాక తమ ఆడబిడ్డల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు లేదా సంరక్షకులకున్న అత్యుత్తమ పెట్టుబడి సాధనంగానూ దీన్ని పేర్కొనవచ్చు. దీనికి రెండేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. దీంతో చదువు కోసం పొదుపు, చిరు వ్యాపారాల కోసం ప్రణాళికల వంటి స్వల్పకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనకూ చక్కగా ఉపయోగపడుతుందనే చెప్పాలి.

### ఏమిటి ఈ పథకం?

మహిళా సాధికారతే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. మహిళలు, ఆడపిల్లల అవసరాలకు పొదుపును ప్రోత్సహించడంలో భాగంగా 2023 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రారంభించింది. ఇందులో సురక్షిత, అధిక రాబడిగల పెట్టుబడులకు అవకాశాలుంటాయి. అయితే ఈ స్కీం పరిమిత కాలమే అందుబాటులో ఉంటుంది. వచ్చే ఏడాది మార్చిదాకే లభిస్తుంది.

### ప్రధాన ఫీచర్లు..

**వార్షిక వడ్డీరేటు:** 7.5 శాతం. ప్రతీ మూడు నెలలకోసారి లెక్కించి జమ చేస్తారు.

**అర్హత:** మహిళలు, ఆడపిల్లలకు మాత్రమే ఈ స్కీంలో పెట్టుబడికి వీలుంటుంది. మైనర్ల కోసం తల్లిదండ్రులు, వారి సంరక్షకులూ ఈ పథకాన్ని తీసుకోవచ్చు.

**కాలపరిమితి:** రెండేండ్లు. స్వల్పకాలిక లక్ష్యాలకు ఇది చక్కని సాధనం.

**పెట్టుబడి:** కనిష్ఠం రూ.1,000. గరిష్ఠం రూ.2 లక్షలు. ఒకేసారి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

### ఏమిటి దీని ప్రత్యేకత?

- ఈ పథకంలో పెట్టుబడులపై ఏటా గరిష్ఠంగా 7.5 శాతం వడ్డీరేటును పొందవచ్చు. సేవింగ్స్ అకౌంట్స్, ఎఫ్‌డీలు, పీపీఎఫ్‌లతో పొందే వడ్డీరేటు కంటే ఇది ఎక్కువ. పీపీఎఫ్‌లో కూడా 7.1 శాతం వడ్డీరేటే వస్తున్నది. మహిళా సాధికారత దృష్ట్యానే ఈ స్కీంకు అన్నింటి కంటే ఎక్కువ వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నారు.
- పెట్టుబడి మొదలైన ఏడాది తర్వాత అందులో 40 శాతం వరకు తిరిగి వెనక్కి తీసుకునే వెసులుబాటు ఈ పథకంలో ఉన్నది. అత్యవసర సమయాల్లో ఈ సొమ్మును వాడుకోవచ్చు. అలాగే ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. కాబట్టి అత్యంత సురక్షితమైన పెట్టుబడిగా దీన్ని పేర్కొనవచ్చు. నిర్భయంగా మహిళలు తమ కష్టార్జితాన్ని ఇందులో మదుపు చేయవచ్చు.

### ఎలా పెట్టుబడి పెట్టాలి?

పోస్టాఫీస్ లేదా ప్రభుత్వ రంగ బ్యాంకులో ఖాతా ద్వారా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో పెట్టుబడులకు దిగవచ్చు. పోస్టాఫీసుల్లోనైతే దగ్గర్లోని పోస్టాఫీస్‌కు వెళ్లి అక్కడ ధరఖాస్తు ఫారంను నింపాలి. మీ వ్యక్తిగత వివరాలు, పెట్టుబడి మొత్తంతోపాటు ఆధార్, పాన్, చిరునామా తదితర అవసరమైన ఇతర కేవైసీ డాక్యుమెంట్లను సమర్పించాలి. పెట్టుబడి మొత్తాన్ని నగదుగానైనా చెక్కు రూపంలోనైనా ఇవ్వవచ్చు. దీంతో ఎంఎస్ఎస్‌సీని అందుకోవచ్చు.

బ్యాంకుల్లోనైతే మీకు దగ్గర్లోని ప్రభుత్వ బ్యాంకుల శాఖలకు వెళ్లి అప్లికేషన్ ఫారాన్ని నింపి, కేవైసీ డాక్యుమెంట్ల జీరాక్స్‌లను సమర్పించాలి. నగదు, చెక్కు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చు. ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫికెట్ మీ చేతికి వస్తుంది. కాగా, పెట్టుబడి పెట్టిన 6 నెలల తర్వాత మీ ఖాతాను మీరు ముగించవచ్చు. కానీ వడ్డీరేటు 5.5 శాతమే వర్తిస్తుంది. రూ.2 లక్షలు పెట్టుబడిగా పెడితే రెండేండ్ల తర్వాత రూ.2,32,044 వస్తుంది.

| డిపాజిట్ | వడ్డీ ఆదాయం | చివరకు వచ్చే మొత్తం |
|---|---|---|
| ₹ 1,000 | ₹ 160 | ₹ 1,160 |
| ₹ 2,000 | ₹ 320 | ₹ 2,320 |
| ₹ 3,000 | ₹ 481 | ₹ 3,481 |
| ₹ 5,000 | ₹ 801 | ₹ 5,801 |
| ₹ 10,000 | ₹ 1,602 | ₹ 11,602 |
| ₹ 20,000 | ₹ 3,204 | ₹ 23,204 |
| ₹ 30,000 | ₹ 4,807 | ₹ 34,807 |
| ₹ 50,000 | ₹ 8,011 | ₹ 58,011 |
| ₹ 1,00,000 | ₹ 16,022 | ₹ 1,16,022 |
| ₹ 1,50,000 | ₹ 24,033 | ₹ 1,74,033 |
| ₹ 2,00,000 | ₹ 32,044 | ₹ 2,32,044 |

## చదువు కోసం మదుపు..

**నేడు** పిల్లల విద్య కోసం చేస్తున్న ఖర్చుల భారం అంతా ఇంతా కాదు. తల్లిదండ్రులకు ఇదో పెద్ద సమస్యలా తయారైంది. అయితే సరైన ప్రణాళికతో పెట్టుబడులు పెడుతూపోతే దీన్ని అధిగమించవచ్చు. దీనికున్న అవకాశాలను పరిశీలిస్తే..

### ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల సాధనకు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ చక్కని మార్గం. సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టే పెట్టుబడులు ఈక్విటీల్లోకి వెళ్తాయి. చిన్న మదుపరులకూ ఇవి ఉపయుక్తంగా ఉంటాయి. అయితే ఈ పెట్టుబడులు మార్కెట్ ఒడిదొడుకులకు లోబడి ఉంటాయన్నది గుర్తుంచుకోవాలి.



### ఎడ్యుకేషనల్ స్కీములు

వివిధ మ్యూచువల్ ఫండ్స్.. పిల్లల విద్య కయ్య